# యంత్రం

ప్రభుత్వం సెలవుదినం ప్రకటించింది:-

నగరంలోని విద్యాసంస్థలు, పారిశ్రామిక కేంద్రాలు, కార్యాలయాలు అన్నీ తాళాల గుప్పిట్లో వుండిపోయ్యాయి. క్రికెట్ ఆట గుస గుస చెప్పింది, కుర్రవాళ్ళను రోడ్లమీద ఆడమని, సినిమాలు ఆకర్షించుకున్నాయి. యువతీ యువకుల్ని తమతో గడపమని. స్వంత ఊర్లు గొంతెత్తి పిలిచాయి, సెలవురోజు ఉద్యోగస్తుల్ని రమ్మని. అంతకు ముందురోజే టెలివిజన్లు, రేడియోలు సంతోషంతో కేరింతలు కొట్టాయి. దిన పత్రికలన్నీ పెద్ద పెద్ద అక్షరాలతో నోర్లు తెరుచుకున్నాయి.

ఆరోజు ఉదయం నుండీ నాయకులకు 'మొహం కడిగే' తీరిక లేదు. పోలీసు వాళ్ళకు నోటినుండి విజిల్ తీసే వీలు లేదు. గందరగోళం విమానాశ్రయంలో దిగింది. ఇతరదేశాల రాయబారులు, శాస్త్రవేత్తలు, అధికారులు వచ్చారు. పూలదండలు సుస్వాగతాలు పలికాయి. కరచాలనాలు మైత్రిని స్పృశించాయి. కార్లు బారులు తీర్చాయి....నగరానికి కొద్దిదూరంలో కొత్తగా

కట్టబడిన భవనాలున్నాయి. అవి ఆ రోజు కొత్తగా ప్రారంభం కాబోయే గా, ప. కేంద్రానివి. అక్కడిదాకా వంకర తిరిగిన మెత్తని రోడ్లు - రోడ్డుకు అటూ యిటూ పెరుగుతూ 'చెట్లు నాటండి' - అనే నినాదంలో చచ్చిపోతున్న చెట్లు! చెట్లమధ్యలో మనుషులు రోడ్డుకు యిరుప్రక్కల !! రోడ్డు మధ్యలో బారులు తీరిన కార్లు - పోలీసు బందోబస్తు.

ఆదే మెయిన్‌రోడ్డుకు కలిసే చిన్న సందుగుండా పదడుగులు పోతే నీళ్ళు రాని కొళాయిదగ్గర బిందెల్తో తిట్టుకుంటున్న బూతులు. కాండ్రించిన ఉమ్ములు పక్కనే క్రమక్రమంగా దిబ్బలుగా మారిన చెత్తకుండీలు - దేశంలో ఎన్ని మార్పులొచ్చినా మారని జీవితాలూ ఉన్నాయ్.

మెయిన్ రోడ్డుమీద ఆర్భాటం - కార్లు కార్లమీద అధికారం - ఊరేగుతున్నట్లు !! ఇదే ఊరేగింపు దృశ్యాన్ని రెండో అంతస్తునుండి కిటికీ రంగుటద్దాల్లోంచి చూస్తూ, ఆనందిస్తూ సన్నని జాజ్ సంగీతాన్ని అనుభవిస్తున్న గొప్పవారు - మెయిన్‌రోడ్డుకు దగ్గర్లోవున్న ఆవరణలో, గార్డెన్ మధ్యలో అందంగా కట్టబడిన బంగళాలలో వున్నారు అక్కణ్ణించి చూస్తే....నీలిరంగు ఎండలో మెరుస్తూ బలిసిన చీమల్లా కదులుతున్నాయి కార్లు. ఎండకు మాడిపోతున్న చెమట ముఖాలు ఆయిల్ పెయింట్ చిత్రంలో లాగా అందంగా కనిపిస్తున్నాయి.

అక్కణ్ణించి మరో మైలుదూరం నగరం సరిహద్దు దాటిపోతే....లారీలు ఆపి, పోలీసు సబ్ ఇన్స్‌పెక్టర్ డ్రైవర్లను బూతులు తిడుతున్నాడు. నగరంలో ఓ మూల నివసించే కుటుంబీకుడు భార్యచెప్పినవేవీ మరిచిపోకుండా సామాన్లు కొనుక్కెళ్ళేందుకు రోడ్లు తిరుగుతున్నాడు. ఓ రచయిత లైబ్రరీలో పుస్తకాల మధ్య దూరాడు. పాలిష్ కుర్రాడి చూపులన్నీ పాదరక్షల మీదినుండే సాగుతున్నాయి. ఇంకో ట్రిప్ అయిపోతే యింటి కెళ్ళొచ్చనుకుంటున్నాడు సిటీబస్ కండక్టరు. తను గీయబోయే నూడ్ చిత్రంగురించి ఏంగిల్ కోసం తనమోడల్‌తో నానా అవస్థలు పడుతున్నాడు ఆర్టిస్టు స్టూడియోలో - అంటించబోయే పోస్టర్ల లైరుద్దుకున్నాడు సినిమా పోస్టర్స్ అంటించే కుర్రాడు.

అక్కడ ప్రారంభం కానున్న గా. ప. కేంద్రం భవనాల దగ్గర - జనం. ఎంతో దూరంనుండి లారీలమీద రైళ్ళమీద తీసుకురాబడిన - జనం ఏం జరుగుతుందో, ఎందుకు జరుగుతుందో తెలియని జనం. తెలుసుకోలేని జనం తెలుసుకున్నా ఏమీ చేయలేని జనం. జనంలో అక్కడక్కడా సి ఐ.డీలు, ప్రెస్ రిపోర్టర్లు, ఫొటోగ్రాఫర్లు, దొంగలు ఒకరినొకరు కనిపెట్టుకుంటూ, ఒకరినొకరు తప్పించుకుంటూ ఎవరిపనిమీద వాళ్ళు ఆత్రంలో ఆందోళనలో ఉన్నారు.

సువిశాలమైన ఆవరణలో ముఖ్యమైన వాళ్ళకార్లు ఆగాయి. కార్లోంచి సీట్‌గావున్న మనుషులు దిగారు. వాళ్ళంతా ఫ్రిజ్‌లోనుంచి అప్పుడే తీయబడిన వాళ్ళలాగా ఫ్రెష్‌గా వున్నారు. అడుగులు మెల్లగా, కార్పెట్ల మీదినుండి, మెట్ల మీదినుండి ఏర్పాటుచేసిన డయాస్ మీదికి వెళ్ళాయి. డయాస్ మధ్యన రెండడుగులు వున్నాయి. అని ఒకప్పటి ప్రజానాయకుడివి. ఇప్పుడతను దేశనాయకుడు డైరెక్టర్లంతా వెంటరాగా అతను వెళ్ళి అతి సుతారంగా చిన్నమీట నొక్కాడు. యంత్రం పనిచేస్తుందన్నట్టుగా ఎర్రని బల్బు వెలిగింది. క్రమంగా యంత్రం చక్రాలు తిరిగాయి. అందరూ చప్పట్లు చరిచారు. దానికి సంబంధించిన అధికారులతోనూ, ఇతరదేశాల శాస్త్రజ్ఞులతోనూ దేశనాయకుడుగారు కరచాలనం చేశారు. చిరునవ్వులు నవ్వారు, చిన్న చిన్న జోకుల్లాంటివి వేసి కొద్ది కొద్దిగా సమయానుకూలంగా నవ్వు కక్కుకున్నారు దర్జాగా—

యంత్రాన్ని పరిశీలనగా చూసారు. దానికి అనుబంధంగా వున్న ఇతర చిన్న చిన్న యంత్రాల్ని గూర్చి అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుద్దేశించి మాట్లాడడం మొదలెట్టారు. వారు మాట్లాడుతూ వున్నప్పుడు ప్రతి నాలుగు నిమిషాలకోసారి ప్రజలు చప్పట్లు చరిచి హర్షం ప్రకటిస్తున్నారు.

"ఈ మొట్టమొదటిగాలి పరిశుభ్ర కేంద్రాన్ని నేను ప్రారంభం చేయడం నాకెంతో సంతోషం కలిగిస్తోంది" - అని నాయకుడుగారు ఉపన్యాసంలోకి దిగుతున్నారు.

ఆ చివర ఎక్కడో జనం మధ్య కలకల బయలుదేరింది. నినాదాలు మొదలయ్యాయి. అరికట్టండి. ప్రతిఘటించండి అన్న కేకలు వినిపిస్తున్నాయి.

కొంతమంది తీవ్రంగా ముందుకు తోసుకొస్తున్నారు కరపత్రాలు పంచిపెడు తున్నారు. లౌడ్ స్పీకర్లో దేశనాయకుని గొంతు వారి కేకల్ని మింగేస్తోంది.

"…. పారిశ్రామికాభివృద్ధి విపరీతంగా జరిగిన విషయం మనకు తెలుసు. 'దాంతో వాతావరణం, గాలి కలుషితమైపోతున్న విషయం మనను తెలుసు. ఈ గాలి పీల్చడం వల్లనే అనారోగ్యం దేశంనిండా వ్యాపిస్తోంది. ఆరోగ్యశాఖ ఎంత శ్రద్ధ తీసుకుంటున్నా లాభం లేకుండా పోతోంది. ప్రప్రథమంగా ఈ యంత్రం మన రాష్ట్రానికి వచ్చింది. ఇది అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ గాలి శుభ్ర పరుస్తుంది. రేషన్‌కార్డులు, పాలకార్డుల మాదిరిగానే దీనిక్కూడా తగిన కార్డులు పంచిపెట్టడం జరుగుతుంది. అతి సామాన్యుణ్ణి దృష్టిలో పెట్టు కుని చార్జీలు నిర్ణయించడం జరుగుతుంది …"

పోలీసులు అప్పుడే అల్లరిమూకలనబడే కొంతమంది యువకులను, 'ప్రగతి నిరోధక శక్తులనబడేవాళ్ళ' ను కస్టడీలోకి తీసుకుని వ్యాన్‌లోకి ఎక్కిస్తున్నారు. పోలీసువ్యాన్ ఎక్కుతున్న వాళ్ళు కరపత్రాలు వెదజల్లు తున్నారు. గొంతులు చించుకుని నినాదాలిస్తున్నారు. ఒకతను మాత్రం తన ఆందోళనంతా వ్యక్తం చేస్తున్నాడు. ఆలోచించండని మరీ మరీ హెచ్చరిస్తు న్నాడు …."గాలిని శుభ్రపరచడం కాదు! మెదడు మొద్దుబారిపోయేట్లు మందులు కలిపి, ఆలోచనల్ని, ప్రశ్నల్ని అణగద్రొక్కే ఘోరమైన ప్రయత్నం. విద్యార్థుల్లారా మేధావుల్లారా కార్మిక కర్షకులారా - మీరీ గాలికబుర్లు వినొద్దు ప్రతిఘటించండి. వెళ్ళండి. పరిశీలించండి. ఈ మోసంలో ఈ కుట్రలో ప్రజల్ని తోసి చేతులు దులుపుకోకండి. ఆయంత్రం బద్దలు కొట్టండి అందు లోని రహస్యాలు వెల్లడి చెయ్యండి. మోసం చేసేవాడి తీయని మాటల్నే ఈ జనం ఎందుకు నమ్ముతుందో విశ్లేషించండి. ఇలాంటి యంత్రాలు, యంత్రా లున్న ఫ్యాక్టరీలు, కార్పొరేషన్లు ఎందుకు తలెత్తుతున్నాయో తెలుసా? ఎందుకూ పనికిరాని దేశనాయకుల కొడుకులకోసం! చదువురాని చవటవెధవల స్వార్థ ప్రయోజనాలకోసం!! ఈ రోజు సంస్థలు స్థాపిస్తారు. రేపొద్దున ఆ సంస్థ ఉత్పత్తిచేసిన వస్తువులు వాడకపోవడం నేరం అని ఉత్తర్వు లిస్తారు. గాలి

నీరు ఆహారం అన్నీ డబ్బుతో తిరుగుతున్నాయి. ఇదంతా గూడుపుఠాణి. దగా ....." గొంతెత్తి చెబుతున్న అతణ్ణి వ్యాన్‌లోకి బలవంతంగా ఈడ్చి నోరు మూసారు. అతను పోలీసులతో పెనుగులాడుతూ వున్నాడు. మరొకతను లేచి ఉద్రేకంతో చెప్పడం ప్రారంభించాడు. "ఆకలితీరని జనం గాలిని కూడా కొనుక్కోగలరా? ఆలోచించండి...." - వ్యాన్ కదిలింది వేగంగా. ఆప్రాంతం వదిలి రోడ్డుమీదికి దూసుకుపోయింది మాటలు దూరమైపోతున్నాయి.

ఏం వింత జరుగుతుందోనని .... సినిమాలో ఏమీ లేకున్నా కేవలం సెక్స్ బొమ్మలున్న బ్యానర్లు చూసి ఎగబడే ప్రేక్షకుల్లాగా - ఆలోచించడం మానేసి కేవలం ఆశ్చర్యంతో జీవితాన్ని వప్పజెప్పి మ్యాజిక్ షో చూస్తున్న - ఎవడే తీయని మాటచెబితే అదే నిజమనుకుని ఓట్లేసే గొర్రెల్లాగా - నిజం బయటపడితేగాని ఇదా దీనిలోని అసలు విషయం అని ఆలస్యంగా వెలిగే అమాయక ట్యూబ్ లైట్లలాగా - చదువుకోరా అంటే పెడచెవిని పెట్టే కుర్రాళ్ళల్లాగా నిలబడ్డారు మధ్య తరగతి జనం

కానీ —

ఆ జనంలోంచే నెమ్మదిగా కొన్ని జతల కళ్ళు దృష్టి మరల్చుకుని వెళ్తున్న వ్యాన్ వైపు చూసాయి. ఎన్నెన్నో చెవులు .... కస్టడీలోకి తీసుకోబడిన వాళ్ళ మాటలు ఉత్సాహంగా విన్నాయి. నిశ్చలంగా నిలబడ్డ కాళ్ళ నుండి కొన్ని కొన్ని కదిలి, గుంపులు గుంపులుగా ఏర్పడి వ్యాన్ వెనక నడిచాయి మీటింగ్ వదిలి, వ్యాన్ వెనక నడిచిన కాళ్ళ అడుగులు గుర్తుపట్టాయి పోలీసు కుక్కలు ఆ అడుగులనుబట్టి పేర్లూ, చిరునామాలూ జాగ్రత్తగా ప్రభుత్వ ఫైళ్ళలో భద్రపరచబడినాయి. ఆ 'అడుగులు' ఇలాంటివి లెక్క చేయలేదు. నగరాలు పల్లెలు ఆ వార్తను గ్రహించాయి. స్తంభించిపోయిన జనంలో చైతన్యం కలిగించడానికి, చిలకపలుకుల ఉపన్యాసాల్లోని విషాన్ని బట్టబయలు చేయడానికి, కుతంత్రాల బురఖాల్ని చించేయడానికి యువత కదిలింది,

యువత కాళ్ళలో ఆలోచనల వేడిరక్తం ఉరకలు వేస్తోంది. ఆ కాళ్ళలో బలిష్టమైన కండరాలున్నాయి. కండరాల్ని చుట్టేసిన నాడుల్లో ఆత్మ నిగ్రహం, స్థిరత్వం, ఉద్దేశ్యం ఉన్నాయి. దేశం నలుమూలలా స్థిరమైన అడుగులు పడుతున్నాయి.

1974

—